"మన మధ్య కృతజ్ఞతలేమిటీ సులోచినా!" అన్నాడు ఆనందంగా.

అతడి చొరవనూ, మాటల్నీ పట్టించుకోనట్లుగానే. "అంటే దానికి కారణం నాఆదాయమే కదా... సపోజ్.... రేపు మైత్రేయిలాంటి అందమైనది, నాజీతంకంటే ఎక్కువ సంపాదించే మరో అమ్మాయి, నేను తటస్థపడినట్లే మీ దృష్టిలోకి వచ్చి మిమ్మల్ని భర్తగా అంగీకరిస్తానన్నదనుకోండి... అప్పుడు నన్నేం చేస్తారు... విడాకులిచ్చి ఇంట్లోనుంచి వెళ్ళగొడతారా?"

కుమార్ ఆమె మాటలకు కలవరపడ్డాడు.

"సారీ... సారీ... అలాంటిది ఎన్నడూ జరగదు!"

"జరిగితే నాపరిస్థితి ఏమిటి అని?" గొంతును కఠినంగా మార్చి అడిగింది.


"నన్ను నమ్మండి!" అన్నాడు ఇబ్బంది పడుతూ కొద్దిగా గొంతు హెచ్చించి.

""ఎలా నమ్మమంటారు?"... ఇప్పుడు జరిగిందదేకదా... అందుకు సాక్ష్యం నేనే.... సారీ! మనస్సుకంటే డబ్బుకే ఎక్కువ ప్రాధాన్యమిచ్చే మిమ్మల్ని నేనుభర్తగా భరించలేను .... ఇంకెప్పుడూఈ విషయాన్ని నాతో మాట్లాడటానికి ప్రయత్నించవద్దు.... గుడ్ బై!" ఫోను పెట్టేసింది సులోచన అతడికి మరోమాటకు అవకాశమివ్వకుండా.

ఆమాటలు చెప్పిన తరువాత ఆమె మనస్సంతా ప్రశాంతమయి పూర్తిగా కంప్యూటర్ మీద ఉన్న అక్షరాలలో లీనమయిపోయింది. అసలు అంతకు ముందు ఏమీ జరగనట్లే!

-క్రితం రాత్రి పదకొండు గంటలప్పుడు తను, మైత్రేయి గంటసేపు ఫోను మీద మాట్లాడుకున్నారనే విషయం మరో ప్రాణికి తెలియదు!

---



ATA 2008 Competitions II Prize Winner STORY $100

# తల్లివేరు

## KV.రమణమూర్తి

"బస్సు అలా బురదలో కూరుకుపోయి కదలకుండావుంటుందనుకుంటామా!అక్కడేదో వంతెన కడుతున్నారట ఆమట్టి అంతా అలాకుప్పలా పోసేశారు, పైగా ఈ కుండపోత వర్షం ఒకటీ! కన్నుపొడుచుకుచూస్తున్నా ఈ చీకట్లో ఏమీ కనిపించటంలేదు. జాగ్రత్తగా నా చెయ్యిపుచ్చుకుని నడవండి. లేకపోత్తే జారిపడి పోతారు! పైగా మీకలవాటు లేని కొత్తప్రదేశం! అరే వేణు! నీబూట్లువిప్పేసి నీదగ్గర సంచీలోవున్న కారీబాగ్ లో పడేసుకో! లేక పోతే ఈ బురద లోంచి నీ కాళ్ళుపైకిరానేరావు! అమ్మా, నేనూ, ముందే అలా చేసి జాగ్రత్తపడ్డాం!"

"ఇదిగో డాడీ! నాచెప్పులుతెగిపోయాయి ఎలా?" అంటూ ఆ చీకట్లోనే అరవటం మొదలుపెట్టింది రోజా!

"ఆ అనుకున్నంతా అయింది. యింకేచేస్తావ్." చీకట్లో చిందులాటని యిప్పుడా బురదలో నీ చెప్పలెక్కడ కూరుకొని పోయి వుంటాయో. ఇంక ఏంవెదుకుతాం! వాటినలావదిలేసి ఇలారా." దేవీ! అమాయి చెయ్యి నీవుపుచ్చుకో! నేను వేణుగాడి చేయి పుచ్చుకంటాగాని! జాగ్రత్తగా నడవండి! అదిగో! ఇంకెంతో దూరం లేదు" వచ్చేసాం ఇంకాస్తవోపిక పట్టండి", అంటూ మాధవ్ భార్యా పిల్లల్ని తీసుకుని ఆ కారుచీకటిలో నడుస్తున్నాడు. మోకాల్లోతు బురద. పాంట్లు పైకెగకట్టారందరూ. నలుగురి చేతుల్లో నాలుగు సూట్ కేసులూ, వెనుక పెద్ద పెద్ద బాగులు! తడుముకుంటూ నడుస్తున్నారు! పైన హోరునవాన! ఎక్కడాగుతుందో!

ఎక్కడ నీళ్ళో! ఎక్కడ మెరకో ఎక్కడ పల్లమో తెలియదాయె! నర సంచారమే లేదు! దూరంగా గుడిసెలు కంబళీలు కప్పుకున్న వృద్ధుల్లా గోచరిస్తున్నాయి! నెత్తికి ఎదురూ ఏదో ప్లాస్టిక్ టోపీలు పెట్టుకున్నా అందరూ తడిసిముద్దయి పోయారు.

పైగా రివ్వున గాలి వీస్తోంది. చీకటిరక్కసుడు నోరు తెరచి ఆహ్వానిస్తూంటే నోటిదంత కాంతిలా అప్పుడప్పుడు మెరుపులు! ఆ మెరపు కాంతుల్లో మాధవ్ కుటుంబం గమ్యస్థానం వెదుక్కుటోంది!

అసలు రాకరాక పదిహేనేళ్ళకి తనమేనమామ కుటుంబాన్ని చూట్టానికి బయలుదేరి వచ్చాడు అమెరికా నుండి మాధవ్!

మనదేశం, మన వాతావరణం, మన పల్లెలు పట్టణాలు, మనజన జీవనస్రవంతి , ఇలా అన్నీ చూపించాలనే తపనతో భార్యా పిల్లలతో మాధవ్ అమెరికా నుండి బయలుదేరి వారంరోజులైంది.

వాళ్ళబ్బాయి వేణూకైతే ఇండియా పై సదభిప్రాయం ఏమాత్రం లేదు. దానికి కారణం వాడు అమెరికాలోనే పుట్టిపెరగటం! అక్కడుండే ఆరోగ్యకర వాతావరణం, నియమాలు, క్రమశిక్షణ ఇక్కడ ఇండియాలో వుండవని, ఈ టీవీలు, పత్రికలు అందించే దుష్ప్రచారం, ఇవన్నీ అతనిపై చాలా ప్రభావం చూపటంతో వాడికి ఇండియన్స్ పై చాలా చిన్న చూపే ఏర్పడింది మొదట్నించి!

"డర్టీ యిండియా! డర్టీ యిండియా! " అంటూ తెగగొణుక్కుంటూ వుంటాడు. దీనికి తోడు చచ్చి చెడి ఆమధ్య ఒక తెలుగు సినిమా చూశాడు. అందులో చాలా మంది ఫైటింగులో చనిపోతారు. వేణు

సంబరపడిపోయి ఓహ్, డర్టీ యిండియన్స్ డజనుమంది చచ్చారు ఆ సినమాలో! ఐ అమ్ వేరీ వేరీ హ్యాపీ !" అంటూ తెగఫీలయిపోయాడు. మాధవ్ , దేవి వాడి మాటలు విని నిర్ఘాంతపోయారు!

"అరే తప్పురా! మనం ఎక్కడనుంచోచ్చాం? యిండియా నుంచే కదా! ఈ అమెరికా ఎప్పుడు మనకు పరాయిదేశం! మనదేశంను, మనదేశప్రజలని అలా కించపరుస్తూ మాట్లాకూడదు, తప్పు!" అంటూ ఇద్దరూ కేకలేశారు.

దేవికి, మాధవికి స్వస్థాన భాషలన్నా, సంప్రదాయమూ, సంస్కృతి అన్నా చాలా యిష్టం. ఆ కారణం చేతనే రోజాకి చిన్నప్పటి నుంచీ భరతనాట్యం, శాస్త్రీయసంగీతం చెప్పిస్తున్నారు. రోజాకూడా మక్కువ పడి దానిని శ్రద్ధగా అభ్యసిస్తూ మన తెలుగు సంఘాలు ఏర్పాటు చేసే సభల్లో తనప్రావీణ్యం చూపిస్తూ ప్రదర్శనలు ఇస్తోంది.

మాధవ్ భాల్యంలోనే తల్లితండ్రుల్ని కోల్పోవటంతో మేనమామ సంరక్షణ లోనే పెరిగాడు. ఆకారణంగా మేనమామన్నా, మేనత్తన్నా వల్లమాలిన అభిమానం! అమెరికాలో వున్నా మేనమామకు మేనత్తకు తప్పనిసరిగా వారివారి పుట్టినరోజులనాడు శుభాకాంక్షలు చెప్పటంతో పాటు తప్పకుండా ఏదో కానుకలు పంపిస్తూంటాడు. అతడి అదృష్టం బాగుండి చదువు బాగారావటం, మంచివుద్యోగం లభించటం, మేనమామ, మేనత్త కుదిర్చిన సంబంధాన్నే చేసుకోవటం, అంచెలంచెలుగా ఎదిగి అమెరికా వెళ్ళటం జరిగాయి. అక్కడో పెద్ద కంపెనీలో మేనేజర్ గా వుంటూ బాగానే గడించినా, తన మూలాల్ని మరచిపోవటం లేదు. ఎన్నో సార్లు ప్రయత్నించి చిట్టచివరకు ఇంత కాలానికి స్వదేశం చేరుకున్నాడు. తన మేనమామ కుటుంబాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తించాలని తనరాక ఎవరికీ తెలియ చేయలేదు.

"హమ్మయ్య! అదిగో ఆ దీపం కనిపిస్తూ వుందే, అ తోటలో! అదేరా మామయ్యయిల్లు! వచ్చేశాం !" అంటూ పిల్లల్ని, భార్యని వురకలెత్తిస్తూ ముందుకు కదిలాడు మాధవ్ ఆ బురద దారిలో!

"ఓహ్! డర్టీ రోడ్స్! డర్టీ మడ్! డర్టీ విలేజ్! డర్టీ హౌస్!", మళ్ళీ తన పాత పాటే పేఙు లంకించుకున్నాడు.

"ఒరేయ్! నీ నోర్మూస్తావా! నన్నుమూయమంటావా! రాస్కెల్ మళ్ళీ నీనోటి నుండి ఆ 'డర్టీ' పదం వచ్చిందో నేనూరుకోను", గట్టిగా కొడుక్కి వార్నింగిచ్చాడు మాధవ్.

---

జోరు వానలో , హెూరు గాలిలో తలుపు మీద దబదబా బాదిన చప్పుడవుతోంది. వాననీళ్ళ చప్పుడా? అనే సందిగ్ధంలో ఏవరువారూ! అని అంటూ అప్పుడే మంచం మీద నడుంవాల్చబోయిన గోపాలం గారు లేచి గదిలో లైటు వేసి , హాల్లోకి వచ్చి అక్కడి లైటు వేసి తలుపు గడియ తీసి దీపం కాంతిలో తడిసి వాడిపోతున్న మాధవ్ కుటుంబాన్ని చూసి ఆశ్చర్యంతో ఆనందంతో వుక్కిరి బిక్కిరై "ఒసేవ్! నిన్నేనే మాణిక్యం! మన మాధవ్ భార్యాపిల్లలతో అమెరికా నుండి వచ్చాడే!" అని ఒక గావుకేక వేశారు.

ఆ కేక అడవిలో సింహగర్జనలాంటిది. ఇంటిల్లిపాదీ వులిక్కిపడి ఒక్కసారి అందరూ వీధి గుమ్మం దగ్గరకు చేరి వింతగా చూస్తున్నారు. మాణిక్యం గారైతే గబ గబా అందరికీ తలో తువ్వాలిచ్చి "ముందుతలలు, వళ్ళు శుభ్రంగా తుడుచుకోండి! అయ్యయ్యో ఎలా తడిసిపోయారో! అదేంట్రా మాధవ్ ముందు కబురు చేస్తే

మనపాలేర్లు వచ్చి జాగ్రత్తగా తీసుకువచ్చేవారు కదా! చాల్లెండి సంబరాలు! రాక రాక వచ్చారు! ఈ వానలో ఈ బురద రోడ్లో ఏం అవస్థలు పడ్డారో ఏమో!", అంటూ వీధి అరుగు మీదికి వచ్చి "ఒరే చిన్ని! అక్కడ నీళ్ళకాగు గదిలోంచి రెండు బకెట్లు వేన్నీళ్ళు పట్టుకురా! వీరందరూ కాళ్ళు కడుక్కుంటారు", అంటూపని మనిషి చిన్నిగాడికి చెప్పి వేన్నీళ్ళు తెప్పించి అందర్నీ కాళ్ళుకడుక్కోమని లోపలికి వెళ్తూ "అరే! ఎప్పుడు ఎంగిలిపడ్డారో ఏమో! అందరూ వేన్నీళ్ళు హాయిగా స్నానంచేసిరండి! కబుర్లు తీరిగ్గా మాట్లాడుకోవచ్చు! చాలా పొద్దుపోయింది! భోజనాల నేను సిద్ధం చేస్తా!", అంటూ వంటింట్లోకి తుర్రుమంది.

వేణూ ఆశ్చర్యపోతున్నాడు. ఇప్పుడింతవానలో, చలిగాలిలో ఈ వేనీళ్ళు క్షణాల్లో ఎలా సిద్ధమయ్యాయి. వీళ్ళందరూ బిలబిలా ఇలాలేచి వచ్చి ఎంత ఆత్మీయత చూపుతున్నారూ అని అనుకుంటూ లోపలికి వెళ్ళాడు. ఇల్లంతా కలయ చూశాడు. పెద్ద పెంకుటిల్లు.

"రండి! రండి! ఇదిగో ఈ గదిలో సామాన్లు పెట్టుకోండి! మాధవ్ నీకీ గది! పిల్లలూ! యిదిగోయిది మీగది! అందరూ బట్టలుమార్చుకోండి నీళ్ళగదిలో చిన్నిగాడు వేన్నీళ్ళు పెట్టేశాడు! అదిగో ఆ మూల బాత్రూములు, లైట్లు వేసే వున్నాయి. హాయిగా తీరిగ్గా మీ బడలిక తీరేట్లు స్నానాలు చేసివస్తే మా అత్తయ్య చేతి రుచిచూడవచ్చు" అని గోపాలగారు అంటూంటే ఆయన వెనుక ఆయన కుమారుడు రంగ, అతడి భార్య మాధవి, అల్లుడు రాంబాబు, కూతురు వల్లి - వస్తూనే అందర్నీ ఆప్యాయంగా పలకరించారు.

వేణుకిది కొత్త! ఇదే అమెరికాలో అయితే ఎంత తతంగం. అక్కడ ఎవరి గోల వాడిదే! ఒకరికొకరు అంటీ ముట్టనట్లుంటారు, ఎంత వరకు అవసరమో అంతే! ఎంత సేపూ ధనార్జనే ధ్యేయం! అన్నీ ఆర్థికపరమైన సంబంధాలే! కాలాన్ని డబ్బుతో కాలమానం చేస్తూవుంటారు. ఎవరింటికి ఎప్పుడు వెళ్ళాలన్నా ముందు అపాయింట్‌మెంట్ తీసికోవలసిందే! ఈ పలకరింపులు ఈ ఆదరణ ,ఆప్యాయత గగనకుసుమాలు!

అందరూ హాయిగా వేన్నీళ్ళలో తనివితీరా జలకాలాడి బట్టలుమార్చుకున్నారు. వాన కొంత తగ్గు ముఖం పట్టింది.

వెండి కంచాలలో వేడి వేడి అన్నంపెగలు పొగలు వస్తున్నాయి, బెండకాయ వేపుడు ఘుమఘుమలు, కందిపొడి, కమ్మని నెయ్యి వాసన పంచేంద్రియాలకు పని చెప్పుతున్నాయి అక్కడి వంటకాలు, వడియాలు, అప్పడాలు, రసం, గడ్డపెరుగు తొంగి చూస్తున్నాయి.

"ఎప్పుడుచేశావత్తయ్య ఇవన్నా" ఉండబట్టలేక అడిగాడు మాధవ్, "ఇందులో నేచేసిన వేమున్నాయి! ఒక్కబెండకాయ వేపుడు, అన్నం, రసం తప్ప ఈ వూరగాయ ఎప్పుడూ ఇంట్లో వుండేవేగా! ఇదిగో ఈ ఆవకాయనిగూడా రుచిచూడు! ఇదంటే నీకెంతో యిష్టంకదా! వీటిని నీవు రుచి చూసి ఎన్నాళ్ళయిందో వుండు నేవడ్డిస్తా", అంటూ మాణిక్యం గారు అందరికీ వడ్డించారు.

"అరేయ్ పిల్లలూ! మొహమాటపడకండి! కావలసిన వన్నీ మరీ మరీ అడిగైనా వేయించుకోండి! ఒరే రంగా, అక్కడ చక్రకేళి అరటిపళ్ళు, రసం మామిడి పళ్ళు ఇలా పట్రా! మనవాళ్ళు రుచి చూస్తారు", అని గోపాలం గారి నోట్లోంచి మాట రావటమేమిటీ అవన్నీ మరో వెండి పళ్ళెంలో అందరి నోరూరిస్తూ సాక్షాత్కరించాయి.

ప్రయాణబడలిక మాట దేవుడెరుగు! అరే యిన్ని పళ్ళా! యివే అమెరికాలో అయితేనే ఒక్కొక్క మామిడి పండు పదిహేను డాలర్లు! ఇరవై డాలర్లును! వేణుగాడి మనసు అమెరికా మార్కెట్లో విహరిస్తోంది.

అందరూ హాయిగా తనివితీర బ్రేవ్ మంటూ విందుభోజనం ఆరగించారు. మాధవ్ అయితే "అత్తయ్యా! నీ చేత వంటయిలా తిని ఎంత కాలం అయిందో కదా! అంటూ మురిసిపోయాడు. పిల్లలు నిద్రలో మునిగి పోయారు వెచ్చని దుప్పట్లు కప్పుకుని!

రంగా, మాధవీ, రాంబాబు, వల్లీ చాలా పొద్దుపోయింది రేపు తీరిగ్గా మాట్లాడుకుందామంటూ నిష్క్రమించారు.

హాల్లో సోఫాల్లో గోపాలం గారు, ఆయన సతీమణి, మాధవ్, దేవి కబుర్లలో మునిగిపోయారు.

"ఎలావుందిరా అమెరికా! చాలా గొడవలవుతున్నాయని టీవీ, పేపరు గోలపెడ్తున్నాయి! మిమ్మల్నందర్నీ చూసి చాలా కాలమైందిరా!", అంటూ మాధవ్ ని ప్రశ్నించారు.

"ఏముందిమామయ్యా! అంతా బిజీలైఫ్! లేచింది మొదలు ఉరుకులూ పరుగులే! ఉదయం లేస్తూనే ఆఫీసు. రాత్రిఎప్పుడు వస్తామో మాకేతెలియదు. పిల్లలకీ అంతే పెద్దలకీ అంతే. రంగడు, రాంబాబు ఏం చేస్తున్నారు. మీ యిద్దరి ఆరోగ్యాలు ఎలా వున్నాయి?"

"మా ఆర్యోగాలకే బాగానే వున్నాయి. కొంచెం మీ అత్తయ్యే! బి.పి అంటోంది. నేనే బి.పి. అంటే బంధుప్రేమే అని వ్యాఖ్యానిస్తూంటా. రంగడు అగ్రి కల్చరల్ ఎమ్మెస్సీ అయి దేశంఅంతా ఉద్యోగరీత్యా తిరిగి ఇంక ఇక్కడే సెటిల్ అయిపోయాడు! ఈ వూరూ, ఈ నేల, ఈ నీరు, ఈ గాలీ, ఈ వాతావరణం ఎక్కడాలేదంటూ నాతోబాటు వ్యవసాయరంగంలోకి దిగిపోయాడు. నాకు అదే మంచిదనిపించినది. తనకున్న పరిజ్ఞానాన్ని వుపయోగించుకుంటూ వ్యవసాయాన్ని పండ్ల మొక్కల పెంపకాల్నీ వృద్ధిచేస్తూ తోటి రైతన్నలకు కూడా చేదోడువాదోడుగా వుంటున్నాడు.

"రాంబాబు నాకున్న రైస్ మిల్ వ్యవహారాలు చూస్తూ యిక్కడే వుంటున్నాడు. వాడేమి నాకు పరాయివాడు కాదు కదా! మేనల్లుడే! ఇదిగో ఈ యిల్లు మరమ్మత్తులు చేయించి కొన్ని గదులు అదనంగా నిర్మించి పల్లెటూర్లో పట్టణవాస వాతావరణాన్ని లాక్కొచ్చాను. మీలాంటి వాళ్ళు వస్తే యిబ్బంది పడకూడదని! ఆ .. అదిగో అప్పుడే ఆవలింతలు ముంచుకొస్తున్నాయని అత్తమ్మకు."

"చాలా సంతోషంమావయ్యా! మిమ్మల్నిద్దరినీ చూసి చాలా కాలమైంది. మాపిల్లలకూ అంతా క్రొత్త! ఈ వాతావరణం, ఈ బంధుకోటి చూపిద్దామని ఎప్పటినుండో అనుకుంటుంటే ఇదిగో యిప్పటికి వీలు చిక్కింది. దేవుడు దయ తలిస్తే.. మిమ్మల్నందర్నీ మాతోబాటు అమెరికా తీసుకువెళ్ళాలనుకుంటున్నాం! మీరుకాదనకండి! ఎంచేతంటే నాకు జ్ఞానం తెలిసినప్పటినుండి తల్లి తండ్రీ తెలియనే తెలియదు. మీరేనాకన్నీను! జన్మనిచ్చింది వారవ్వచ్చు. కాని జ్ఞానజన్మిచ్చింది మీరు, తప్పక మాతో రావాలి మీరుభయులూ నా మాట కాదనవద్దు!"

"ఒరే మాధవ్! నీ అభిమానం అలాంటిదిరా! కాని మాకూ వయస్సు పైబడింది! అమెరికా వచ్చి ఏంచూడాలిరా! యిక్కడికంటే రోడ్లు పెద్దవికావచ్చు, విశాలంగా వుండొచ్చు, పరిశుభ్రంగా వుండవచ్చు! ఇంక మేడలంటావా! ఇక్కడి మేడలకంటే ఎత్తైనవుంటాయి!

టీ.వీ ల్లో చూస్తున్నాంకదా! ఇంక చూసేవేముంటాయ్! మనుషులందరూ వొక్కటే. మేమిక్కడ పుట్టి పెరిగాం. ఈ వాతావరణం వదిలి రావడం అంటే చెరువులోంచి చేపపిల్ల గట్టుమీద పడ్డట్టే! ఇక్కడ అలా ఒక్కసారి పొలం గట్లు తిరిగి వచ్చాననుకో నాకు కాలక్షేపం అయిపోతుంది. పది మందినన్ను ఆశ్రయించుకుని బ్రతుకుతున్నారు. నేనులేనిదే వాళ్ళుండలేరు. అలా అని ఉట్టిగట్టుకు నూరేళ్ళూ వుంటానని కాదు. వున్నన్నాళ్ళు మన జీవనపరిమళాలు అందరికీ అందించాలనే నాతపన! వ్యవసాయం అంటే ఏటికేడాది పనులే! ఎవరికీ క్షణం తీరిక వుండదు.

"ఈ పల్లెలో బడి లేక నానా అవస్థలు పడుతూ ఇదిగో ఇందాక మీరువచ్చారే ఆ బురదలో ఆ బాడిలో అయిదారు కిలోమీటర్లు పసికూనలు, పిల్లలు నడచి పుస్తకాల బరువుతో బడికి వెళ్తున్నారని మా అమ్మా నాన్నల పేర పాఠశాల కట్టించాను. అదిగో ఎట్టకేలకు కాలువపై వంతెన వస్తోంది. ఇంక దాంతో బస్సులు తిన్నగా మన వూరువచ్చేస్తాయి.

"ఎక్కడ పడితే అక్కడ మనకు పుష్కలంగా నీరు, హాయిగా నిష్కల్మషమైన గాలి, మన సొంత పంటలు, మంచియిల్లు - ఈ వాతావరణం ఎక్కడ వస్తుంది? జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ అని శ్రీ రామచంద్రమూర్తి ఉత్తినే అనలేదనిపిస్తుంది. అదిగో దేవాలయం నుండి సుప్రభాతం వినవస్తోంది. ఈ బడి, గుడి, ఈ వూరు - ఇవిమాకు ప్రాణాలు. అన్నట్లు కొంచెం మీరిద్దరూ నడుం వాల్చండి!", అంటూ గోపాలంగారు మాణిక్యం గారితో పాటు ముందుకు వెళ్ళబోయారు.

అంతలో మాణిక్యం అత్తయ్య అందుకుని, "ఒరే మాధవ్ మీమావయ్య గారికి ఈ కొంపే కైలాసం అనుకో! మన దేశాల్లాంటి దేశం ఎక్కడా లేదంటార్రా! ఎన్ని నదులు, ఎన్ని పుణ్యక్షేత్రాలు, ఆర్జనకు పట్టణ వాసం, అనుభవానికి పల్లెటూరు. ఈ సామెత పోయింది ఆర్జనకు అమెరికా! అనుభవానికి ఇండియా! అంటూ మార్చేశార్రా! అంతే కాదు భారత భాగవతరామాయణ శ్లోకాలు పద్యాలు అలా ఆయన చెప్పుతూ ఓసిపెర్రి మొహమా మన దేశంలో ఆ పరమాత్మ దశావతారాలెత్తేడే! ఏ దేశంలోను ఆయన అలా ఎత్తలేదు. అవన్నీ భోగభూములు. మన దేశం త్యాగ భూమి, యోగ భూమి, తపో భూమి, కర్మ భూమి - ప్రపంచానికి ఆధ్యాత్మికత నేర్పే భూమియిదేనే అంటూ కన్నతల్లి, వున్న వూరూ ఒక్కటేనే అని నాకు ఒకటే నూరిపోస్తారు. రోజూను నాకదేదో తెలియని దానిలా" అంటు పకపకా నవ్వుకుంటూ ఆయన్ని వెంబడించింది.

ఆయిద్దరి ఆనందం చూసి మాధవ్, దేవి ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ గదిలోకి వెళ్ళారు.

"చూశావా, దేవీ వాళ్ళ ఆనందం? అవీ జీవితాలంటే! ఇదేమిటండీ? ఈ గదిలో యింత వెచ్చగా వుంది బయట అంత చలిగావుంటే!"

"ఓహో అదా! అదిగో అలా పైకి చూడు. ఇది మిద్దె గది. అలా వెదుళ్ళుంచి పైన దళసరిగా ఒండ్రు మట్టితో పైన అలుకే వారు. అలాంటి గది వేసవిలో చల్లగా వుంటుంది, శీతాకాలంలో వెచ్చగా వుంటుంది నీ ఒడిలా!"

"చాల్లెండి సరసాలు!" అంటూ మాధవ్ వొళ్ళో దేవి వాలిపోయింది.

"మరి అదే మీకు ఏసీలు అనారోగ్యాలు, ఇవి ఆరోగ్య ప్రదాలు!"

"సరేలెండి మీ వ్యాఖ్యానాలు రాద్ధాంతాలు సిద్ధాంతాలు!"

"అవును కాని వేణుగాడి ధోరణి రానురాను మారిపోతోంది. వాడి వికృత చేష్టలు, మాటలు పైగా అమెరికాలో ఆ స్వేచ్ఛ వీణ్ణి ఎడారిలోకి మళ్ళిస్తోందనే భయం పట్టుకుందేనాకు"

"నాకూ మీకూ ఒకే భావనండీ!"

"అందుకే మనం భార్యా భర్తలమయ్యాం! ఏమంటావ్! మనం ఇక్కడికి మకాం మార్చేస్తే అసలు సమస్య వుండదుకదా!"

"కాని మన పిల్లలు ఒప్పుకుంటారా!"

"వాళ్ళకేంతెలుసు! పిల్లకాకేంతెలుస్తుంది ఉండేలు దెబ్బ అని సామెత! మనకు డబ్బుకు లోటులేదు. హాయిగా ఆ డబ్బుతో ఇక్కడ ఒక కాలేజీ ఏర్పాటు చేసి మన మాతృదేశ ఋణం తీర్చుకుందాం! అల్లాగే ఒక ఇండస్ట్రీ నెలకొల్పి మన వారందరికీ తగిన ఉపాధి కల్పిద్దాం! "

"భేష్! మంచి ఐడియా అండి. పై పై సహాయాలు చెట్టుపై నీళ్ళు చల్లటంలాంటివి. అదే దేశమనే వృక్షం తల్లివేరుకు నీళ్ళు పోస్తే దేశవృక్షమే కళకళలాడుతూ వుంటుంది. మన వంతు కృషి తప్పక మనం చేద్దాం"

మాధవ్ దేవీల హృదయాల్లో కొంగ్రొత్త కోణాలు ఆవిర్భవించి అవి పల్లెలను మరింత ఆకర్షవంతంగా తీర్చిదిద్దేందుకు ఎగబాకుతున్నాయి.

వేణూ, రోజా తెల్లవారటమే తరువాయి ఇంటి వెనుక వున్న తోట తోటంతా కలియతిరిగారు. హుషారుగా ఉల్లాసంగా అక్కడ మామిడి చెట్టుకు కట్టి వున్న ఉయ్యాల ఎక్కి అలసిపోయేంతవరకు వూగారు. అక్కడే జామిచెట్టు, సపోటా వున్నాయి, తనివితీరా వాటి పళ్ళు కోసుకుని తీపికబుర్లు చెప్పుకుంటూ అలా చెరువు గట్టు దగ్గరకు వచ్చి కాళ్ళు నీళ్ళలో పెట్టుకుని పాంచాలరేవులో చీడీ లపై చతికిలబడ్డారు. చిరు చేపలు వాళ్ళకాళ్ళను సున్నితంగా మొప్పలతో స్పృశిస్తూంటే పిల్లల ఒళ్ళు ఝల్లుమంది. అదొక అనుభూతి, వాళ్ళిద్దరికీ ఏదో కొత్త లోకంలో వింతలోకంలో, ఎప్పుడూ చూడని లోకంలో విహరిస్తున్నట్టుగా వుంది. చెరువులో తామరాకులు, తామర పూలు పల్లెల్లో సోయగాలను సంతరించుకున్నాయి. చెరువుగట్టు నిండా గులాబీ పూల మొక్కల శ్రేణులు, ఆ వెనుకనే రకరకాల మందార పుష్పాలతో శోభిల్లుతున్న మందారవనం! నందనవనం ఇలా దివినుండి భువికి దిగి వచ్చిందా అన్నట్లుగా ఉంది ఆ తోట!

ఆ ఇద్దరూ లేచి మూలవున్న పొదల దగ్గరకు వెళ్తూంటే "బాబూ ఆ మూలకు వెళ్ళకండి! అవన్నీ సంపెంగ పొదలు, త్రాచుపాములుంటాయి!" అంటూ చిన్నీ గట్టిగా హెచ్చరిస్తూ కేకపెట్టాడు.

ఈ లోపుగా వీళ్ళని వెదుక్కుంటూ దేవీ, మాధవ్, ఇద్దరూ అక్కడకు వచ్చారు. అందరూ మళ్ళీ చెరువు గట్టుపై కూర్చొని పిల్లవాయువుల్లో తేలుతున్నారు.

గోపాలంగారు తోటంతా ఒకసారి చుట్టి వచ్చి వీళ్లందరి దగ్గరకు వచ్చి కూర్చొని మాటల్లో మునిగిపోయారు.

దూరంగా కూలీలు వరిచేనుకోస్తూ పాటపాడటం మొదలు పెట్టారు! హరి హరీ నారాయణో ఆది నారాయణో! కరుణించి మమ్మేలూ కమలలోచనుడా! అందరూ కోరస్ గా "ఆయ్!" అంటున్నారు.

"ఏమిటి తాతయ్య గారు ఆ పాట," అడిగింది రోజా!

"పంట చేలుకోస్తూ అలసట తెలియకుండా వుండడానికి వాళ్ళు అలా పాటపాడుతున్నారమ్మా." అని గోపాలంగారు సమాధానం చెప్పి "రోజా నీ సంగీతం మాకెప్పుడు వినిపిస్తావు? నీ నాట్యం మాకెప్పుడు చూపిస్తావు?" అంటూ నవ్వుతూ అడిగారు.

"రాత్రి, తాతయ్య గారు తప్పకుండా" అంటూ హుషారుగా అంది రోజా. పైన పిట్టలు అదో వరుసగా వక్రంగా కదులుతూ వింతసోయగాల్ని ఆకాశానికి అద్దుతున్నాయి.

పిల్లలు అలా ఆకాశం వైపు వింతగా చూస్తున్నారు. ఎక్కడో మామిడి గుబుర్లలోంచి కోయిల కుహూ కుహూ అంటుంటే పిల్లలిద్దరూ దాన్ని అనుకరిస్తున్నారు. ఆ కోయిల కూడా పోటీపడిందేమో అన్నట్లుగా మళ్ళీ మళ్ళీ కూస్తూనేవుంది. పిల్లలిద్దరూ మైమరచిపోయారు.

"రాబోయేది సంక్రాంతి కదా అందరూ పంటల కోతల హడావిడిలో వున్నారు. మనకు సంవత్సరం పొడుగూతా పండుగలే! సంక్రాంతి, శివరాత్రి, ఉగాది, శ్రీరామనవమి, వసంతనవరాత్రులు, వినాయకచవితి ఓహ్ ఒకటేమిటి శ్రావణమాసం నోములు, ఆశ్వయుజమాసం, దేవీనవరాత్రులు, కార్తీకమాసం స్నానాలు, అభిషేకాలు, శివార్చనలు, వన సంతర్పణలు, - ఇలా అవుతూనే వుంటాయి ధనుర్మాసం వచ్చేస్తుంది. - ఇదీ మన సంస్కృతి సంప్రదాయం, నిత్య నూతనోత్సాహం, పండుగలు పిండి వంటలు, క్రొత్త బట్టలు, ఇక ఏదేశాలలో ఇంత ఉత్తేజం ఉండదేమోరా! మాధవ్!"

"అవును మావయ్యా! మేం అక్కడ చూస్తున్నాం కదా ఒక్క క్రిస్మస్ తప్ప, అదైనా డిసెంబరులో మినహాయించి తక్కిన సంవత్సరమంతా చప్ప చప్పగా నడుస్తుందనుకో. అందుకే వాళ్ళు మదర్స్ డే, ఫాదర్స్ డే, వాలంటైన్స్ డే అని ఏవేవో క్రొత్తకొత్తవి నూతనోత్సాహం నింపుకుందుకు, వ్యాపారస్థులైతే తమ వస్తువిక్రయాలు పెంచుకుందుకు అనువుగా చూసుకుంటున్నారు. మరి నా చిన్నతనంలో ఈ వనభోజనాలు, ఈ పండుగలు మరచిపోదామన్నా మరచిపోలేను, అవొక దివ్యస్మృతులు. ఇప్పుడిప్పుడు పాశ్చాత్యులు కూడా మన సంస్కృతీ సాంప్రదాయాల్ని మెచ్చుకుంటున్నారు. కట్టూబొట్టు అనుకరిస్తున్నారు. అంతెందుకు మొన్నటికి మొన్న యు.ఎన్.ఓ లో సభారంభానికి ముందు వేదపఠనం ఏర్పాటు చేసుకున్నారు. అలాగే కెనడాలో కూడా వేదనాదంతోనే వాళ్ళ పార్లమెంట్ మార్మోగించారు. విదేశీయులు మన సంస్కృతీ సంప్రదాయాల్ని మెచ్చుకుంటూంటే మనం విదేశీయుల్ని అనుకరించే వికృత పోకడల్కి పోతున్నాం!"

"అవున్రా నీవు చెప్పింది యధార్థం. మాతృదేవోభవ, పితృదేవోభవ! ఇది మన సాంప్రదాయం, మనవారు ఏర్పాటు చేసిన ప్రతీ కట్టు బొట్టులోనూ అటు ఆరోగ్యం, ఇటు ఆధ్యాత్మికత, మేళవించివున్నాయిరా!" అని గోపాలంగారు అంటున్నారోలేదో చిన్నా పెద్ద కావిడితో అక్కడకు వచ్చాడు. ఒక బుట్టతో నారింజ, కమల, నిమ్మఫలాలున్నాయి. మరో బుట్టలో తేగలు, బుర్రగుంజు, ముంజెలు కిటకిటలాడుతున్నాయి.

"సమయానికి మంచి పని చేశావురా! ఆ ముంజెలు చేజాపి యిలాయివ్వు లాగించేస్తాం", అంటూ గోపాలంగారు పిల్లలకు వాటిని అందించటం మొదలుపెట్టారు. పిల్లలెప్పుడూ వాటిని చూడలేదేమో పోటాపోటీగా తింటున్నారు. వాళ్ళతో జతకలిపారు మాధవ్, దేవీ!


"కొన్ని తేగలు ఆ గడ్డి మంటలో కాల్చుకుని తేగలు తంపటవేశాడు. కొన్ని తేగలు కుండలో వుడకపెట్టు మూడ్ రకాల రుచి చూస్తారు!" గోపాలంగారి పురమాయింపు, చిన్నీ ఆచరణ, తినడం పిల్లలవంతు.
ఈలోపుగ బుర్రగుంజు తీపిని ఆస్వాదిస్తున్నారు.
ప్రక్క రైతు ఉరవయ్య పెద్ద పాత తపేలాతో అక్కడకు వచ్చి రేత్రికి మాదే రుచి చూస్తే మాకదే పదేలు ఎళ్తానండే! అంటూ ఆ తపేలా అక్కడ పెట్టి వెళ్ళిపోయాడు.

"జున్నా! ఏంటండీ అదీ" రోజా వేణులొక్కసారి ప్రశ్నించారు, "రుచి చూడండి మీకేతెలుస్తుంది" అంటూ చెరువులో తామర ఆకుల్ని ముంచి కడిగి తెచ్చి వేడివేడి జున్ను గోపాలంగారు ఇద్దరికీ వడ్డించారు.

"భలేభలే యిదే వనభోజనం" అంటూ మాధవ్, దేవీ, పిల్లలు సంతోషంలో మునిగిపోయారు.

"డాడీ! మనకి అమెరికా కంటే ఇక్కడే బాగుంది. ఈ స్వేచ్ఛ, ఈ బంధుప్రీతి, ఈ వాతావరణం, ఎక్కడ డాడీ!" అంటూ వేణూ ప్రశ్నించేటప్పటికి దేవీ, మాధవ్, ఆశ్చర్యపోవటం వారి వంతయింది.
"డాడీ! మన ఇండియాయే గ్రేట్! డాడీ!" రోజా వంతపాడటం మొదలుపెట్టింది.

"డాడీ నేనేదో అనుకున్నా ఇండియా గురించి! అ యామ్ సారీ ఇండియా ఈజ్ గ్రేట్. ఎప్పుడూ ఫియర్ తో లైఫ్ అమెరికా! అదివద్దు డాడీ! అదొక జైల్ అదివద్దు డాడీ!" వేణు అప్రయత్నంగా కన్నీళ్ళుకారుస్తున్నాడు. పైనుండి నీలిమేఘాలు వాన చినుకులు రాలుస్తున్నాయి






# కొమ్ము దువ్వెన

ఆనందరావు పట్నాయిక్

నల్లటి తార్రోడ్డు మీద తెల్లటి కారు దూసుకుపోతుంది. ఎ.సిలో కూచున్నా స్టీరియో నుండి లోఫేజ్ ట్యూన్స్ వినిపిస్తున్నా రాండే అంకలాంకి చికాకుగా ఉంది.

కారణం ఇండియన్ రోడ్లు. ఎన్నాళ్లయితే ఈ దేశంలో రోడ్లు బాగుపడతాయి? అదే అమెరికాలో అయితే ఫోర్ లేన్ రోడ్లు, సిక్స్ లేన్ రోడ్లూ ఉంటాయి. తన ఎర్ర స్పోర్ట్స్ కారుని నడుపుతుంటే గంటలు గంటలు సమయం గడిచిపోవాల్సిందే. ప్రయాణబడలిక అన్పించదు. గుంటలు, స్పీడు బ్రేకర్లు, పాట్హోల్స్ అసలే ఉండవు. కానీ ఇక్కడ ఈ ఇండియాలో అదే ఈ మారుమూల శ్రీకాకుళం జిల్లాల్లో రోడ్లు ఇంత నాసిరకంగా ఉంటాయని అనుకోలేదు. తప్పదు ఒకసారి కమిట్ అయింతర్వాత వెళ్లక తప్పదు.

శ్రీకాకుళం వచ్చింది. నోరు పిడచకట్టుకుపోతుంది. డ్రైవరు బండి ఆపాడు. పెద్దషాపది. డ్రైవరులోనికి వెళ్లి వెంటనే తిరిగి వచ్చేసాడు. మినరల్ వాటరు బాటిల్ ఉంది కానీ కూల్గా లేదట. కరెంటు లేదట. "షిట్" అనుకొన్నాడు రాండే. అలా అనుకోవడం అది పదోసారి "పోనీ" అన్నాడు కసిగా. కారు కాంతిపుంజమయింది.

మధ్యాహ్నం ఒంటిగంటకు ఒమరవిల్లి చేరింది కారు. చిన్న పల్లెటూరు. చిలకాకుపచ్చ రంగు చీరలో సింగారించుకున్న చిన్నదిలా ఉంది ఆ ఊరు. కొమ్మల మాటున గండు కోయిల కూసింది. కోయిల కూత విని ఎన్నాళ్లయింది? రేబాను కళ్లద్దాల గుండా చూశాడు రాండే. కోయిలకు బదులు కాకి కన్పించింది. గుబురుగా పెరిగిన గున్న మామిడి చెట్టు మామిడి పూతతో బలిసి ఉంది. అప్పుడే వస్తోన్న మామిడిపూతను అరచేతులకు రాసుకుంటే పాము కాటుకి అద్భుతంగా పనిచేస్తుందని సోములు తాత చెప్పాడు. సోములు స్కూల్లో గంటకొట్టే బంట్రోతు. మామిడి పూతను తెంపి అరచేతులకు రాసుకొనే కోర్కెను బలవంతంగా చంపుకొన్నాడు. కారణం తన స్టేటసు. అక్కడకు వి.వి.ఐ.పి హోదాలో వచ్చాడు.

జనం బారులు తీరి ఉన్నారు. ముత్తైదువులు హారతి పళ్లెంతో ఎదురు వచ్చారు. బొట్టు పెట్టారు. కుంకుమజారి తెల్లషర్టుపై పడింది. నిర్మలాకాశంలో నిశ్చల మేఘంలా ఉందా దృశ్యం. పళ్లబిగువున అదిమాడు కోపాన్ని. అందరూ చప్పట్లు చరిచారు. లంగా, ఓణీ వేసుకున్న ఇద్దరు అమ్మాయిలు పూల బొకేలు ఇచ్చి నమస్కరించారు.

హైదరాబాద్ వచ్చినప్పుడు బిల్క్లింటను తనకు బుకేలిచ్చిన వాళ్లని ఎత్తుకొని ముద్దాడాడని పేపరులో చదివాడు. తనకీ చెయ్యాలన్పించినా విరమించుకొన్నాడు. కారణం తన డ్రస్సు పాడయిపోతుంది. ఇక మీడియా తనని ఇరవై నాలుగు గంటలు అదేపనిగా టెలికాస్ట్ చేసి అపర బిల్క్లింటన్ అని ఆడిపోసుకుంటుంది. అమ్మాయిలు ఇద్దరూ గుర్రాల్లా ఎదిగి ఉన్నారు.

బాబ్డు హెయిరు చూసి చూసి విసుగెత్తిపోయిన తనకు వాళ్ల కేశ సంపద చూసేసరికి ముచ్చటేసింది. అరచేతులకు ఎర్రని గోరింటాకు అబ్బురపరుస్తుంది. మోడర్న్ అమ్మాయి వేసుకునే హెన్నా జుగుప్స కలిగిస్తోంది తనకు.

ఈ మధ్య న్యూస్ లేక టి.వి. చానెల్సు సినీ తారలకూతుళ్లు లేచిపోయినా, ముసలి తల్లి తండ్రులు చనిపోయినా, ముచ్చటగా మూడోపెళ్లి చేసుకొన్నా, సినిమా నటుడి బాగోతాన్ని అదే పనిగా చూపెడుతున్నాయి. తను అ యజ్ఞానికి సమిధ కాకూడదు.

రిబ్బను కత్తిరింపు సీను ముగిసింది. ఫోటోగ్రాఫరు అనేక కోణాల్లో షూట్ చేసాడు. చిరునవ్వు చిందిస్తూ ఫోజులిచ్చాడు. అవి ఎన్లార్జ్ చేసి తనింట్లో పెట్టుకోవాలి. అక్కడున్న వైద్యశిభిరంలో ప్రవేశించాడు. కారులో ఉన్న పళ్ళ బుట్టలు, స్వీట్స్ ప్యాకెట్స్ వచ్చాయి. రోగులకవి పంచాడు. మళ్లీ ఫోటోలు. పళ్లతో పాటు డాలర్లు నోట్లు కూడ పంచుతాడేమోనని రోగుల కళ్లలో ఆశలదీపాలు.

కట్టిన షామియానాలో సభ ఆరంభమయింది. ఒమరవిల్లి తన తల్లి పుట్టి పెరిగిన ఊరు. ఆ ఊరిని తను దత్తత తీసుకున్నట్లు ప్రకటించాడు రాండే. ఊరి ప్రజల ఆనందానికి అవధులు లేవు. అది మరో న్యూయార్క్, లాస్ ఏంజిల్స్ లాగానో మారిపోతుందనుకొన్నారు. పిచ్చివాళ్లు, నిజంగా పిచ్చోళ్లు వాళ్లు.

కారు బయల్దేరింది. భోజనం చేసి వెళ్లమన్నారు ఊరివాళ్లు. ఇంకేమైనా ఉందా? అక్కడ తిండి తిని, నీళ్లు తాగి, ఆ గాలి పీల్చి, తను బతికి బట్ట కట్టగలడా! రాండే ఒళ్లు జలదరించింది. సున్నితంగా తిరస్కరించాడు. అమాయకులు వాళ్లు. ఆ రోజు మాఘ సప్తమి. అరసవిల్లి సూర్యనారాయణ మూర్తిని దర్శనం చేసుకోనిదే భోంచేయడు దొర అనుకొన్నారు.

"పమిడి కాయ నీళ్లు తాగండి బాబు!"

తన సమాధానికి ఎదురు చూడకుండాకొబ్బరి బొండాం కొట్టి ఇచ్చారు. చల్లగా, తియ్యగా ఉన్నాయి ఆ నీళ్లు. తన అలసట మాయమయిపోయింది. మరోటి తాగాలని ఉన్నా, కోరికను చంపుకొన్నాడు రాండే.

వస్తున్నప్పుడు దారిలో కాకాహొటల్లో పెసరపుణుకులు వేపుతున్న వాసనకి నోటి నుంచి నీళ్లు ఊరాయి. చిన్నప్పుడు వేసవికి ఆ ఊరొచ్చిన తనని మేనమామ తీసుకెళ్లి పుణుకులు ఇప్పించేవాడు. ఆత్రుతగా తిని పొలమారిన తనను ముద్దు బెట్టుకొని సత్తు గ్లాసులోని నీళ్లు తాగించేవాడు.

"ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమసమూహము లేవి తల్లీ"

శ్రీశ్రీ గేయం గుర్తొచ్చి మనస్సు చివుక్కుమంది. "డ్రైవరు! బ్యాంకు మూసేసే లోపు వెళ్లి తీరాలి," హుకుం జారీ చేశాడు. డ్రైవరు జవాబివ్వలేదు. అతని చేతిలోని స్టీరింగు జవాబు చెప్పింది. నల్లటి కొండచిలువ లాంటి రోడ్డుని మింగేస్తూ కారు పరిగెడుతోంది. కొద్ది సేపట్లో బ్యాంకు ముందు నిలిచింది.

తండ్రి, తను జాయింటు పేర మీద బ్యాంకులాకరు తీసుకొన్నాడు రామకృష్ణ. తన అత్తా, మామయ్య అమెరికా వచ్చినప్పుడు వాళ్ల ద్వారా ఒక కవరు పంపించాడు తండ్రి. అందులో లాకరు కీ ఉంది. లాకరు ఓపెను చేశాడు రాండే. మాష్టారిగా పనిచేసి రిటైర్ అయిన తన తండ్రి ఏమిటి ఉంచి ఉంటాడు కదా! మహాఅయితే నాన్నమ్మ వెండి కడియాలు, తాతయ్య పొడుం డబ్బా అయి ఉండాలి తప్ప మణులు మాణిక్యాలు ఉండవు.

అతని అంచనాలను తారుమారు చేస్తూ లాకరులోని వస్తువులు ఒక్కొక్కటి బయటపడుతున్నాయి. పల్లెలోని ఇంటి దస్తావేజులు, డాలరు నోట్లకట్ట, డైరీ, చివరిగా ఒక దువ్వెన. అది కొమ్ముతో చేసిన పళ్ల దువ్వెన. దానిని చూడగానే రాండేకి గతం గుర్తుకొచ్చింది.

అనోట్లకట్ట తండ్రికి తను ఇచ్చినవే. నోట్లకి కట్టిన రుమాలు తనకు బాగా గుర్తు. తనిచ్చిన సొమ్ము ఖర్చు పెట్టలేదేమిటి తండ్రి! కొమ్ము దువ్వెన పాటిది చెయ్యదా.. అమెరికా మాజీ ప్రెసిడెంటు లింకన్ బొమ్మ ఉన్న పచ్చనోట్లు... షిట్....

దొంతర దొంతరలుగా పేర్చిన జ్ఞాపకాల పుటలు తెరుచుకొంటున్నాయి.

అంకలాం అప్పారావు మాష్టారు అంటే ఆ ఊరికి ఆదర్శమూర్తి. ఆయన దగ్గర చదివిన విద్యార్థులుబాగా పైకొచ్చినవాళ్లే. అటువంటింది అతని కున్న ఒకే ఒక్క కొడుకు తండ్రంతటివాడు ఎలా కాకుండా ఉంటాడు?

రామకృష్ణ ఇంజనీరింగ్ చదివాడు. చదివిన వెంటనే ఉద్యోగం వచ్చింది. ఉద్యోగంరాగానే పెళ్లి కూతుళ్ల తండ్రులు క్యూ కట్టారు. తనకున్న మనీపవరు, సీటు పవరుతో ఆ క్యూని ఛేదించి రామకృష్ణని అల్లుడిగా చేసుకొన్నాడు పోలీసు కమీషనరు కనకారావు.

మంచి కార్పొరేటు ఉద్యోగం, అత్తగారిచ్చిన రెండంతస్తుల మేడ, అందమైన భార్య.... ఇవేవీ రామకృష్ణని సంతోషపెట్టలేదు. నిచ్చెనలు ఎక్కి వైకుంఠపాళీలోని ఆఖరిగడి చేరుకోవాలన్న కోరిక బలీయంగా ఉంది. తిండి, చదువు, బట్ట ఇచ్చాడు. కాని నిచ్చెనలు ఇవ్వలేని తండ్రంటే రామకృష్ణకి చిరాకు. రిటైరయి తన ఇంట్లో ఉంటున్న తల్లిదండ్రులంటే కంపరంగా ఉండేది రామకృష్ణకి.

హిందీ సినిమాల్లో చూపించినట్లు లాల్చీ, పైజామా వేసుకోడేంటి ఈ ముసలి మాష్టారు. లుంగీ దానిమీద బనీను, బనీనుకి కన్నాలు.... కోపం వచ్చేది రామకృష్ణకి తండ్రిని చూస్తుంటే .

బ్రెయిను డ్రెయినులో చాలామంది ఇంజనీర్లు, డాక్టర్లు అమెరికాకి కొట్టుకుపోతున్నారు. రామకృష్ణకి క్లాసుమేట్స్ ఇద్దరు కాలిఫోర్నియాలో ఉన్నారు. సెలవులకు వాళ్లు కుటుంబాలతో ఇండియాకి వచ్చారు. వాళ్లని హొటల్‌లో దిగనీయకుండా నేరుగా ఇంటికి తీసుకొచ్చాడు రామకృష్ణ.

"సార్! టైమయింది. స్ట్రాంగు రూం మూసెయ్యాలి." వినయంగా చెప్పాడు బ్యాంకు ఆఫీసరు. పెద్ద అమౌంటు ఏమైనా ఫిక్సిడ్ డిపాజిట్ చేస్తాడేమోనని అతని ఆశ.

రామకృష్ణ లాకరులోని వస్తువులు బ్రీఫ్ కేసులో సర్దుకొని బయల్దేరాడు. కారు కదిలింది. అతని ఆలోచనలు మళ్లీ గతంలోకి పరుగెత్తాయి.

ఫోను మోగింది. అవతలి వ్యక్తి చెబుతున్న మాటలు విని రామకృష్ణ కనుబొమ్మలు ఆశ్చర్యంతో ముడి పడ్డాయి. మరో ఐదు నిమిషాల్లో అతను పోలీస్టేషన్లో ఉన్నాడు. ఇన్స్పెక్టరుతో మాట్లాడి తండ్రిని ఇంటికి తీసుకు వచ్చాడు.

రోజు మార్నింగ్ వాక్ కి వెళ్లడం అప్పారావు మాష్టారుగారికి అలవాటు. కానీ ఆ రోజు ఒక పెద్ద హొటలు ముందున్న డ్రెయినేజీలో చెయ్యిపెట్టి తీస్తున్న అప్పారావుగారిని పోలీసు పెట్రోలు వ్యాన్ సిబ్బంది పట్టుకొన్నారు. ఎంత అడిగినా చెప్పడట. ఇన్స్పెక్టర్ అన్న మాటలు గింగురుమంటున్నాయి. రామకృష్ణకి తన తండ్రితో అవసరమయితే తప్ప మాట్లాడడు. తల్లికి ఈ విషయం చెప్తే ఆమె చెప్పిన విషయం విని ఆశ్చర్యపోయాడు రామకృష్ణ. ముందురోజు జరిగిన సంఘటన గుర్తుకు వచ్చింది.

కాలిఫోర్నియా నుండి వచ్చిన మిత్రులిద్దరూ హొటల్లో ట్రీట్ ఇస్తామన్నారు. అందరూ కలిసి స్టారుహొటలుకి వచ్చారు లంచ్ కి. లంచ్ ముగిసిన తర్వాత బయటకు వచ్చి నిలబడ్డారు.

మాష్టారు గారు జేబులోంచి దువ్వెన తీసి తల దువ్వుకున్నారు. అంత వయసు వచ్చినా మాష్టారిగారి జుట్టు నల్లగా, దట్టంగా వుంటుంది. దువ్వెన దూరకుండా ఉండే తలకట్టు. నల్లమల కొండలమీద దట్టంగా పెరిగిన అటవీ సంపదలా ఉంటుందది. రామకృష్ణది పల్చటి క్రాపు. అంతా

మేనమామ పోలికలు అంటాడు హాస్యంగా తన భార్యతో మాష్టారుగారు. ఆమె చిరుకోపంతో మూతి ముడుచుకోవడం ఎన్నోసార్లు గమనించాడు రామకృష్ణ. కానీ తన సంసారంలో ఈ అచ్చట, ముచ్చట ఉండదు. తన భార్య ఇంటర్నెట్ లో బందీ.

"బాబూ! నీ జుట్టు కాస్త దువ్వుకోరా నాన్నా!"

తండ్రి మాటలు విని ఊరుకున్నాడు రామకృష్ణ. మాష్టారు గారు దువ్వెనతో కొడుకు జుట్టు దువ్వారు. రోజూ ఇదే తంతు. ఇంట్లో మంచి జెన్సోర్ దువ్వెనలున్నా ఈ కొమ్ముదువ్వెనతో రోజూ తన తల దువ్వుతాడాయన. ఇంజనీరు గారిని ఆ వేళ స్నేహితుల ముందు దువ్వడం అవమానమనిపించింది. ఎడమచెయ్యితో తోసారు. దువ్వెన ఎగిరి డ్రైయినేజిలో పడింది.

వేకువ జామున ఆ దువ్వెనతీసే ప్రయత్నంలో పోలీసుల కంటపడ్డాడు తండ్రి. ఆ దువ్వెన అంత గొప్పదా! బ్రీఫ్ కేస్లో నుండి తీశాడు రామకృష్ణ. కొమ్ముతో చేసిన పళ్ల దువ్వెన. అటువంటివి కేవలం ఒకేచోట అదీ ఒరిస్సా రాష్ట్రంలోని పర్లాఖిమిడి టౌనులో జంతువుల కొమ్ముతో చేస్తారు. అది తండ్రి జన్మభూమి.

దువ్వెన చేతిలో పట్టుకొంటే తండ్రి చెయి వెచ్చగా ఉన్నట్లనిపించింది రామకృష్ణకి. మామూలు స్కూలు టీచరుకి ఇంజనీరింగ్ చెప్పించాలంటే కష్టతరమైన విషయం. ప్రొద్దున్న, సాయంత్రం ట్యూషన్లు చెప్పేవాడు తండ్రి. స్టడీ టూర్ కి, అంతా కేరళ వెళ్తుంటే ఆఖరి క్షణంలో డబ్బుకట్టి కొడుక్కి తోటి విద్యార్థులతో కేరళ పంపారు మాష్టారు గారు. అటు నుండి తిరిగి వచ్చిన రామకృష్ణకి తల్లి మెడలో పుస్తెలతాడు బదులు పసుపు తాడు కన్పించింది.

వెచ్చని నీరు బుగ్గల మీద జారడంతో ఉలిక్కిపడ్డాడు రామకృష్ణ. కరడు కట్టిన కసాయి లాంటి తనలో కూడ కరుణరసం పొంగి పొరలుతుందా? డ్రైవరు గమనించకపోవడంతో సర్దుకు కూచున్నాడు. కారు చక్రాలు పరుగులిడుతున్నాయి.

మొత్తంమీద రామకృష్ణ ప్రయత్నాలు ఫలించాయి. అతనికి అమెరికాలో ఉద్యోగం దొరికింది. అతని పేరు తెల్లదొరల నోట పలికేదికాదు. రామకృష్ణ రాండే అయ్యాడు. కోటిన్నర రూపాయల బంగళాకి అధిపతి అయ్యాడు. ఒక పాపకి తండ్రయ్యాడు. మామ, అత్తగారు అమెరికా వచ్చి ఆరు మాసాలుండి వెళ్లారు. తల్లి, తండ్రికి పాసుపోర్టు, వీసా ఏర్పాటు చేశాడు రామకృష్ణ. కానీ బడి పంతులు గారు సముద్రాలు దాటి ఖండాంతరాలు ఎగిరి దేశం కాని దేశం వెళ్లడానికి అంగీకరిచలేదు.

మీ ఇన్లాస్ వచ్చారు. కానీ మీ పేరెంట్స్ ఏమి రావడంలేదని చుట్టు ప్రక్కల వాళ్లు ప్రశ్నించడం, రామకృష్ణ కుంటి సమాధానాలు చెప్పడం పరిపాటయింది. నిజమే అమెరికాలో ఎన్.ఆర్.ఐ. ఇళ్లకు ముఖ్యంగా తెలుగువాళ్ల ఇళ్లకి తల్లీ, తండ్రి రావడం ఆనవాయితే. తల తీసేసినట్లనిపించేది రామకృష్ణకి.

తల్లి చనిపోవడంతో రామకృష్ణకి జన్మభూమికి రాక తప్పలేదు. కర్మకాండలు అయ్యాక తిరుగు ప్రయాణం కట్టాడు. నోరు విడిచి తండ్రిని తమతో రమ్మనమని పిలిచాడు. మాష్టారు గారు మొండి మనిషి, రాను కాక రానన్నాడు. కోపంతో ఫ్లైట్ ఎక్కి వచ్చేసిన రామకృష్ణ మరి ఇండియా వైపు చూడలేదు. మాష్టారు గారు ఏమయ్యారో, ఎలా ఉన్నారో తెలుసుకొనే ప్రయత్నమూ చెయ్యలేదు.

అక్కడ అమెరికాలో ఉగాది నాడు తెలుగు వాళ్లంతా కలిసి పండగ చేసుకొంటుంటారు. ముఖ్యంగా ఇండియాలోని తల్లి తండ్రులు ఆ సీజనులోనే అమెరికా రావడంకద్దు. పొందూరు

ఖద్దరుపంచె, లాల్చీ కండువా కట్టుకొని తండ్రులు, పట్టుచీరల గరగరల మధ్య తల్లులు తిరుగాడుతుంటే రామకృష్ణ మనస్సు చివుక్కుమనేది. తన దగ్గర కోట్ల ఆస్థి ఉంది. అవి పిల్లలు పెట్టి మరింత ధనవంతుడ్ని చేశాయి తప్ప మానసికంగా తను గర్భదరిద్రుడు. అమెరికాలోని తెలుగువాళ్లంతా తనని పరిహసిస్తున్నారనిపిస్తుంది. ఏదో ఒకటి చెయ్యాలి. తల్లితండ్రుల ఋణాన్ని, జన్మభూమి పెట్టిన భిక్షను తీర్చేయ్యాలి.

"సార్ హొటల్ వచ్చేసింది."

డ్రైవరు వినయంగా చెప్పాడు. అరె అప్పడే వైజాగు వచ్చేసిందా? ఆలోచనలు తన మెదడుని కవ్వం చిలికినట్లు చిలకడంతో ఇవేవీ గమనించలేదు. బంగాళాఖాతం ఒడ్డున పైవుస్టారు హొటల్ సాదరంగా ఆహ్వానిస్తుంది.

సూర్యుడు అస్తమించాడు. నగరం నల్లని ముసుగు వేసుకుంది. ఎవరో చమ్కిగుండ విసిరినట్లు నక్షత్రాలు నీలాకాశంలో మెరుస్తున్నాయి. చవితి చంద్రుడు స్తబ్దుగా ఉన్నాడు. కెరటాల ఆటుపోట్లు పౌర్ణమి, అమావాస్యలనాడే ఉంటాయి. సముద్రుని చూస్తే శాంత స్వభావుండంటారు ఆ రోజు. అక్కడా అక్కడా లంగరు వేసిన షిప్పు ఒంటిరాతి మేడల్లా వయ్యారంగా ఊగుతున్నాయి.

డీలక్స్ రూంలో కూచొని స్కాచ్ సేవిస్తున్నాడు రామకృష్ణ. స్టేట్స్ నుండి రాయల్ సెల్యూట్ తెచ్చుకొన్నాడు. ఇక్కడ ఇండియాలో అన్నీ కల్తీ.... తిండి కల్తీ.... నీరు కల్తీ... గాలి కల్తీ.... మందు కల్తీ, పిట్ అనుకొన్నాడు రామకృష్ణ. అలా అనుకోవడం అది అరవైఆరోసారి. కడుపులో దిగిన రాజవందనం మందమందంగా తన ప్రతాపం చూపెడుతోంది. అప్పుడు గుర్తుకు వచ్చింది రామకృష్ణకి. లాకరులోంచి తెచ్చిన డైరీ తీసుకొని పేజీలు తిరగలేస్తున్నాడు. తన తండ్రి డైరీ రాయడమొకటా... వెటకారపు నవ్వు అతని పెదవుల మీద ప్రతిఫలించింది.

మాష్టారు గారి రాత ముత్యాల కోవ. అది రోజూ రాసే దినచర్య కాదు. ముఖ్యమైన విషయాన్ని పేర్కొంటూ పేజీలు నింపబడ్డాయి. ఒక్కొక్క పేజీ చదువుతుంటే ఆసక్తి దాయకంగా ఉంది అతనికి.
లార్జ్ పెగ్ తీసుకొని వేపిన జీడిపలుకులు బౌల్ ముందుకు లాక్కున్నాడతను. రాత్రి మూడయింది. చిన్న ముల్లని చిక్కించుకోడానికి పెద్దముల్ల పరుగులు తీస్తుంది. ఆవురావురమని వస్తోన్న విలన్ లాంటి పెద్దముల్లని బిక్కపోయి చూస్తుంది చిన్నముల్లు. గడియారంలోని అంకెలు అలానే కళ్లప్పగించి చూస్తున్నాయి ఆ అఘాయిత్యాన్ని.

బాటిలు ఖాళీ అయింది. బౌల్ ఖాళీ అయింది. అతని బుర్ర ఖాళీ అయింది. డైరీచదవడం పూర్తయింది. రామకృష్ణ తాగిన అసలుసిసలైన ఆల్కహాల్ నిషా కల్గించలేదు. అతనింకా షాకు నుండి తేరుకోలేదు.

అది ఆంధ్రా, ఒరిస్సా రాష్ట్రాలకు బోర్డరు. రోడ్డు గతుకులతో నిండి ఉంది. కారు ఆగి వుంది. రోడ్డు సైడు పూరిపాకలో పుణుకులు తింటున్నాడతను. స్టీలు గ్లాసులోని నీళ్లు తాగి దారిలో ఆగి కాస్త పక్కనున్న పూలని పరామర్శించి వాటి పరిమళాన్ని తనతో తీసుకొచ్చాడు.

డ్రైవరుకి వింతగాఉంది. నిన్నటి యజమానికి ఈ రోజు దొరబాబుకి ఎంత తేడా! మరికొద్ది సేపట్లో కారు పర్లాఖిమిడి చేరుకుంది. ఒక పెంకుటిల్లు ముందు ఆగింది. సగంకూలి జీర్ణావస్థలో ఉంది ఇల్లు. డైరీలో తండ్రి రాసిన వివరాల ప్రకారం అతను తనస్వంత ఊరిలో ఉండాలి. అదీ రంజిత్ మహారాణా, రాజవీధి అడ్రసులో ఉండాలి. అతను

తోబుట్టువులు వలస పక్షులయి చెట్టుకొకరు పుట్టకొకరయినట్లు తెలస్తోంది.

ఆ ఇంటి వరండా మీద బొమ్మలు అమ్ముతున్నారు. అవన్నీ కొమ్ముతో చేసినవే. నల్లగా నిగనిగలాడుతూ కొంగలు, కోతులు, ఏనుగులు, రొయ్యలు, కడవనెత్తి మీద పెట్టుకొన్న కోమలి బొమ్మలు అద్దాల బీరువాల్లో ఉన్నాయక్కడ. ఎవరో బొమ్మలు కొనడానికి వచ్చి ఉంటారనుకొన్నాడు షాపతను.

"రంజిత్ మహారాణా ఇల్లు ఇదేనా?" రామకృష్ణ ప్రశ్న.

"అవును సారూ! ఇదే రండి." మహారాణా సంతోషం పట్టలేక పోతున్నాడు. అంత పెద్దకారులో ఇంత చిన్న ఇంటికి వచ్చి తన బొమ్మలు కొనబోతున్నాడు. తన పేరు ఆ ఊరిలో మారు మ్రోగిపోతుందన్న మాట అనుకున్నాడతను.

"మా నాన్న ఉన్నారా?"

రామకృష్ణ ప్రశ్నకు తెల్లబోయాడు మహారాణా "మీ నాన్న అంటే ?"

"అప్పారావు మాష్టారుగారు," శాంతంగా జవాబిచ్చాడు రామకృష్ణ.

"ఉన్నాడు. రండి బపా.... బపా!" అని పిలిచాడతను. కుచేలుడి ఇంటికి కృష్ణ పరమాత్మ వచ్చినట్లు ఉబ్బి తబ్బయిపోతున్నాడు మహారాణా. రామకృష్ణ వరండాలోనికి రాబోయాడు. చూరుకి ఉన్న రాట నుదుటికి తగిలి బొప్పికట్టింది. ఎదిగేకొద్దీ ఒదిగి ఒదిగి ఉండమన్నారు పెద్దలు. అలా ఒంగి ఒంగి ఇంట్లోకి వెళ్లాడు. మంచం మీద మాష్టారు పడుకొని ఉన్నారు. రామకృష్ణని చూశారు మాష్టారు. ఆవెలుగు నుండి చీకటి లోనికి వచ్చాడతను. అరచేయి కళ్ళ మీదుగా పెట్టి చూశారు మాష్టారు. చీకటి చీలిపోయింది. సూర్యకిరణాలు ఒడిలో పునీతుడయిన యోగమూర్తి వచ్చినట్లుంది ఆ దృశ్యం. మాష్టారు గారి ఒడిలో తలపెట్టుకుని ఏడుస్తున్నాడు రామకృష్ణ. "నాన్నా, నేను వచ్చేసాను. ఐ హేవ్ కమ్ ఫర్ ఎవర్." ఇదంతా చూస్తున్న మహారాణా పిల్లలకు అర్థం కానీ విషయం ఒకటి ఉంది. అచ్చం తమ తండ్రిని పోలిన మరో వ్యక్తి ఆఇంటికి రావడం తండ్రికి సూటు వేసి, బూట్లు తొడిగితే అచ్చం అతిధిలా ఉంటాడని వాళ్ల ఆలోచన.

ఒక వేసవిలో భార్యతో తన ఊరికి వచ్చిన అప్పారావు మాష్టారుగారు తన చిన్ననాటి స్నేహితుడా చిన్నా మహరాణాని కలిసారు. గంపెడు సంసారం. అతని భార్య మగ బిడ్డని ప్రసవించింది. ఆబిడ్డకి ఆడదిక్కు కావాలి. మాష్టారు భార్య ఆకుర్రాడికి తల్లయింది.

చిన్న మహారాణా మంచి కళాకారుడుర. గేదె కొమ్ములతో మంచి బొమ్మలు చెక్కి అమ్ముతాడు. అతని చేతిలో ఏ మాయ ఉందో కానీ ఉలి అలికిడి విన్నంతనే అవి అపూర్వ కళాఖడాలయ్యేవి. అవి విదేశాలకు కూడా వెళ్లాయి. పెద్ద పెద్ద మోటల్స్లో కూడ అవి ఉండేవి.

రామకృష్ణని దత్తుఇచ్చేముందు కొన్ని బొమ్మలు, ఒకదువ్వెన ఇస్తూ ఒక కోరిక కోరాడు చిన్నా మహారాణా. తను ఎలానూ పట్టణం రాలేడు. తన చిన్నారి చిట్టీ కన్నయ్యను చూసేందుకు, రోజు తనిచ్చినపళ్ల దువ్వెనతో బుల్లబ్బాయి బుజ్జి క్రాఫ్‌ని దువ్వితే తనే తన కొడుకు తను నిమిరినట్లుంటుందన్నాడు. నేస్తం కోరిక పెద్దదేమీ కాదు. సరేనని మాట ఇచ్చాడు మాష్టారు.

కంటికి కనపడని దుమ్ము, ధూళి తలలో పడి దాగుంటుంది. పేళ్ళు, ఈళ్లు తలలో తామర తంపలుగా పెరిగి సంసారం చేస్తుంటాయి. వాటినన్నింటినీ శుభపరిచి, అందమైన తలకట్టు నిలబెడుతుంది దువ్వెన. కొమ్ము దువ్వెన బలంగా,

ధృఢంగా ఉంటుంది. దాని పళ్లు దగ్గర దగ్గరగా ఉండి ఎప్పుడూ విరగవు. కుళ్లు కల్మషం, కుహనా సాంప్రదాయం గూడు కట్టిన రామకృష్ణ మనసున పక్షాళనం చేసింది కొమ్ము దువ్వెన. ఇప్పటికే అతను మాష్టారు గారి డైరీ చదివినట్లు ఎవరికీ తెలియదు. రామకృష్ణ అంకలాం ఇప్పుడు విశాఖపట్నంలో ఒక సాఫ్ట్వేర్ కంపెనీ పెట్టి దానికి సుందరం అని పేరు పెట్టాడు. అది మాష్టారి గారి భార్య పేరు. అతని మనవరాలు తాతగారిని విడిచిపెట్టి క్షణం ఉండలేదు. ఇప్పుడు స్కూలుకి వెళ్తోంది. అందరూ ఆమెను ముద్దుగా చిన్నా అని పిలుస్తారు.

ఒమరవిల్లి గ్రామం ఇప్పుడు ఆదర్శగ్రామంగా పేరు తెచ్చుకొంది. వచ్చే రిపబ్లిక్ డే నాడు గవర్నరు చేతుల మీదుగా అవార్డు అందుకోబోతున్నాడు. రామకృష్ణ "మాతృ ఋణం తీర్చుకో" అన్న అతని నినాదం అమెరికాలోని ఆంధ్రులకళ్లు తెరిపించాయి కాబోలు, ఇప్పుడు ఎయిరిండియా ఫ్లైట్ నిండా మాతృ దేశానికి తిరిగి వచ్చేస్తున్నా తెలుగు బిడ్డలే. వలస పక్షులు వచ్చేస్తున్నాయి.

విశాఖపటణం నడి బొడ్డున అదొక షాపు. 'ది కూమ్బ్' అని పెద్ద పెద్ద అక్షరాలున్న సైను బోర్డు ఉంది. బోర్డు మీద కొమ్ముదువ్వెన బొమ్మ పెయింట్ చేసి ఉంది. అక్కడ కొమ్ముతో తయారుచేసిన వివిధ ఆకృతులు దొరుకుతాయి. ముఖ్యంగా టూరిస్టులకు అదొక ఆట విడుపు. విదేశాలనుండి పెద్ద పెద్ద అర్డర్సు వస్తుంటాయి. రంజిత్ మహారాణా ఆ షాపుకి యజమాని.

తండ్రిని ఇన్నాళ్లు పోషించి ఆపత్కాలంలో ఆదుకొన్న తన ఋణాన్ని ఈ విధంగా తీర్చుకొంటున్నాడు రామకృష్ణ. మాష్టారికి ఇప్పుడు తృప్తిగా ఉంది. 'గ్రామాన్ని సాకు మాతృ ఋణం తీర్చుకో' అనే సూక్తిని నిజం చేసిన పుత్రుడు పున్నామ నరకం నుండి రక్షిస్తాడో లేదో గాని పుట్టిన గడ్డ ఋణం తీర్చుకొంటున్నాడు.



# కవితలు




# కవితలు


| | | |
|---|---|---|
| 1. | బ్రతుకే బరువౌతున్నా | తెలుసునా కవులు |
| 2. | ఆటా | సర్వేశ్వర  రెడ్డి |
| 3. | తెలుగు వసంతం | వైద్యుల మధుధర్మా రెడ్డి |
| 4. | అతని రాక కోసం | కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి |
| 5. | తెలుగు గతి ఇంతే | K.వీరభద్ర శాస్త్రి |
| 6. | ఏ దేశమేగినా... | ముప్వ వెంకట్రామి రెడ్డి |
| 7. | జీరో సైజు కోసం | కొణతం వెంకట రమణా రెడ్డి |
| 8. | మాతృభాష మాధుర్యం | నాగులచవితి వసంత రావు |
| 9. | సెక్సీ పెద బాలశిక్ష! | గుర్రాల రమణయ్య |
| 10. | మాతృమూర్తి మమకారం | |
| 11. | బాల్యం | కె.వి. ప్రసాదు |
| 12. | నిధి చాలా సుఖమా? | వేములపల్లి శంకరరావు |
| 13. | కులం మతం | ఆంకినీడు ప్రసాద్ |
| 14. | ఉపాధ్యాయుణ్ణి నేను | కె. మురళీ చెర్రీ |
| 15. | మహితాంధ్ర జాతీయత్వం | దుర్గాప్రసాద్ వారణాసి |
| 16. | తెలుగు వెలుగు | డా. సమ్మెట విజయ. |
| 17. | సజీవ శవ ఆక్రందన | ఆళ్ళ నాగేశ్వరరావు |
| 18. | కళామతల్లి ముద్దు బిడ్డలు | వాసాల వెంకటేశ్వర్లు |
| 19. | మనమిప్పుడు మాట్లాడటం | మంచికంటి |
| 20. | జీవనది | ఏటూరి నాగేంద్రరావు |
| 21. | గోడమీద పిల్లి | కాయల నాగేంద్ర |
| 22. | చివరి దశ | చలపాక ప్రకాష్ |
| 23. | స్నేహము | మోహన్ వల్లభజోశ్యుల |
| 24. | స్టేట్యూ ఆఫ్ లిబర్టి | భమ్మిడిపాటి కామేశ్వరి |
| 25. | అమెరికాని  చూచిన | S.V.రామా రావు |
| 26. | కలల బంగారం | ఈతకోట సుబ్బారావు |
| 27. | టెర్రొరిజం | శ్యామ్  విజయ్ |
| 28. | (వి)చిత్ర కవిత్వం | శ్రీ  J.రామకృష్ణ  శర్మ |

# బ్రతుకే బరువౌతున్నా, బరువు చూసి బ్రతుకుతున్నా!

*The Poets of Telusuna*



*On my recent visit to India, in December 07, walking on a thickly populated street I caught up with a very interesting and inspiring small poor kid (must be 4th or 5th grade) sitting on the street all by himself, any one could step on him, doing his school work while trying to earn his livelihood with weighing machine (probably he may get paid 50 paisa or a rupee by people who wants to check their weight). Like others I passed for some distance thinking about that kid, after couple minutes I got strong feeling to take picture of this kid and share with others. Since I didn't have camera, though I was carrying my I phone and captured his picture. He was so serious in his homework; he didn't even observe my shooting.*

*Paramesh Bheemreddy*

This picture was offered to the poets at తెలుసునా (తెలుగు సదస్సు నార్త్ అమెరికా), a literary society in New York. The following are various impressions and emotions aroused by this picture.

**బ్రతుకు చిత్రం … శ్రీనివాస్**

పసివాడని వయసులో
మసిబారిన జీవన భారాన్ని
భారయంత్రంతో జయించాలనుకునే
భావిభారత పౌరుడు
మరో సియాచిన్ సైనికుడు---
అపర భగీరథుడు ----

శుష్క వాగ్దానాలతో
పరస్పర నిందారోపణలతో
జనహిత కాలాన్ని ప్రతిక్షణం ఉరితీసే
స్వార్థనేతల మలిన రాజకీయాల
కర్కశ లోహ పదఘట్టనల మధ్య
తలెత్తుకు నిలిచిన బ్రతుకు చిత్రం

చిత్ర విచిత్రం ----
మహా స్ఫూర్తిదాయకం---

జనారణ్య ఘోషలో
పుడమి తల్లి ఒడిలో
సరస్వతీ వందనం
నవోదయ నాందికి భూపాలం
మరోప్రపంచ ప్రస్తావనకు సంకీర్తనం

**వీధివిద్యాధరుండు .. దుర్గాప్రసాదు వారణాసి**

వీధి వాట నొక్క విద్యార్థి యగు వాడు
చదువు చుండి నంత సంతసంబు
వాని కరుణ నేలి వాణి దీవించునో
తెలుగు ప్రభవ మెరుగు తెలుగు బ్రాత!


నా చదువుల తల్లి

**ఉత్తేజపరిచే అబ్బాయి ... మోహన్ వల్లభజోశ్యుల**

కొనియాడకుండ నుండనగునా, తగునా
కనినంత నంతటి అఖండ నిమగ్నతా గతిని
వీనులకింపవని విపరీత ధ్వనుల కోలాహలంలో
ఆనడిబజారు నందంత యేకాగ్రతన విద్యాభ్యాశాశక్తుడై

వీనులున్న నిపుడు వినరాదన్నట్లు
కన్నులున్న కేవలము చదువుకేనన్నట్లు
శరీరమెక్కడున్న మనసు పాఠాంకితమా యన్నట్లు
ఈనిమిషము పోయిన మరల రాదన్నట్లు
అనివార్యమన్నట్లు నతడు చదువుతున్న తీరు
వేనోళ్ళ ఆదర్శవంతమని చెప్పవలసినదే కదా!

**ప్రకాశంలా ... రమాకాంతరావు చాకలకొండ**

*ప్రకాశం పంతులు గారు వీధి దీపాల వద్ద చదువుకొని మన ప్రధమ ముఖ్యమంత్రిగా ప్రకాశించారు, మరి యీ బాలుడు వీధిలో పనిచేస్తూ చదువుకొంటూ ఏలా వికాశిస్తాడో!*

ప్రకాశంలా ప్రకాశింప పవర్ లైట్ల పని లేదు,
వికాశింప, విద్య నేర్వ, వీధైన పరవా లేదు.

కష్టించి పని చేస్తూ, విద్యలకై కృషి చేస్తూ,
దృష్టంతా చదువు పైనే, నిలిపిన ఓ నేస్తమా!

పాపిష్టి లోకమని పని చేయను బద్ధకించి,
ముష్టి ఎత్తి బ్రతుకుటలలో మాన్యతేమి ఉన్నది?
మృష్టాన్నము, మహిలోని మహోన్నత పదవులు,
సృష్టిలోని సుఖాలన్నీ - కష్టించే వారికే!

పని చేస్తూ బ్రతుకుటలో పరమ సుఖము ఉన్నదిలే,
దాని పైన చదువుటలో దూర దృష్టి వున్నదిలే,
కాణీలని అనుకోక వచ్చినంత పుచ్చుకొని,
వాణి కృప పొందుటలో భవిష్యత్తు ఉన్నదిలే!

చదువు పైన మనసు నిల్పి చురుకుగా సాగాలి,
పదునైన విద్య నేర్చి పైపైకి పోవాలి,
విద్య నీకు వికాశము, ఉన్నతిని కూర్చునులే,
వీధి మీద ఉన్న నీకు మేడ, పదవు లిచ్చునులే!

**లేదు లేదు అనటము తప్పు .... సుబ్బు గరికపాటి**

లేదు లేదు అనటము తప్పు .. ఉన్నది
ఉపయోగించటము ఒప్పు
ఒక చిత్రము కోటి మాటల పెత్తు .. భారత దేశమును
ఈ బాలుడులో చూడు
ఎంతకూ తొనకడు, పరిశర శబ్దాలకు చలించడు, లేనిది
గురించి ఆలోచించడు
వచ్చిన వారి బరువు కొలిచి మరు క్షణం పుస్తకములో
తల దూర్చి
చదువు ధ్యాసలో ఉన్నా ఈ బాలుడుకి ఆశీర్వచనములతో
నా హీరో ఈ బాలుడు, ఆ తరువాతే అబ్దుల్ కలామ్ గారు

## "ఆటా"
## సర్వేశ్వర రెడ్డి

సంస్కృతుల సమైఖ్యపు బాట
ప్రవాసాంధ్రుల పసిడిబాట
ఆనందాల పూజల్లుల కోట
అనుబంధాల హరివిల్లు ఆటా
మాతృభూమిపై మమకారం
మానవత్వానికి మీ సహకారం
ఖండాంతరాలలో మీ ఖ్యాతి
తరతరాలుగా మరవదు మన జాతి ॥
జాతి వైషమ్యాలు లేని నేస్తాలు
ఆపదలలో అభయ హస్తాలు
ఆత్మ సౌందర్య గనులు
ప్రవాసాంధ్రుల మణులు
ప్రపంచానికే పెన్నిధి
మన మమకార సన్నిధి
మానవతా విలువల కోట
ఆదర్శ భావాల మన ఆటా
వెలిగించింది విజ్ఞాన జ్యోతి
ముందుంచింది మన ఖ్యాతి
తెచ్చింది తెలుగువారిని ఒక్క త్రాటిపై
మెచ్చింది మనవారి మేధా ధాటిపై
రూపాయి, డాలర్ రూపాలు
ప్రపంచానికే మణి దీపాలు
"పెంటగాన్" సాక్షిగా పెద్ద మనసు
ఆటా అంటే అందరికి తెలుసు
మా ఆటా పాట చోట అంత ఆటా
ఇక కలుస్తాను మళ్ళీ TATA

## తెలుగు వసంతం
## వైద్యుల మధుధర్మా రెడ్డి

తెల తెల వారక ముందే...
చీకటి తెరల్ని చీల్చుతూ వసంతం రానే వచ్చింది.
కొత్త చిగుర్లు.. కొంగ్రొత్త ఆశలు.. నాలోనిండి,
నూతన తెలుగు సంవత్సరానికి స్వాగతం అంటూ పలకరించింది.
వసంతం కొత్తదైనా నాలో అన్నీ పాత ఊసులే...
రోజు వింటున్న కోయిల పాట పాతదే....
మావిచిగురు, వేపపూత, వెన్నెల రాత్రుళ్ళు అన్నీ అన్నీ పాతవే.
అయినా .. ఏదో తెలియని ఆవేదన నాలో నిండి నన్నే
ప్రశ్నించింది.
దేశభాషలందు తెలుగు లెస్సన్న రాయల మాట రాళ్ళపాలు చేసి,
పురాణాలు, ఇతిహాసాలు, చారిత్రక సాక్షాధారాలకు సమాధి కట్టి,
అమ్మ అనే మాధుర్యాన్ని మమ్మీ తో మంట గలిపి,
అన్య భాష తెగులును తలకెక్కించుకుని,
తేనే లొలుకు తెలుగును నిర్లక్ష్యం చేసి,
కన్న భాషను చిన్నతనంగా చూసి,
అరువు తెచ్చుకున్న ఆంగ్లాన్ని వొచ్చీరాని యాసలో
అనుకరిస్తుంటే,
తెలుగుతల్లి గుండెల్లో ఎన్ని వేదనలో...తెలుగు జాతి కళ్లల్లో ఎన్ని
రోదనలో...
గతమెంత ఘనకీర్తి ఉన్న.. వర్తమానం ప్రశ్నగా మారి...భవిష్యత్తునే
వెక్కిరిస్తూంటే...
మాతృభాష రక్షణ కు కృష్ణ, గోదారి పరవళ్ళుగా మారి...
అమ్మ భాష కోసం అంకితమై పోరుతాం...
అన్యభాష పెత్తనాన్ని తరిమితరిమి కొడతాం...
తెలుగు జాతి కీర్తి భావుటా నలుదిశల ఎగరేస్తాం...
'తెలుగు తల్లికి జై' అంటూ దిక్కులన్ని ఒకటిగా నినదిస్తాం...
జై తెలుగుతల్లీ... జై తెలుగుతల్లీ...

ATA 2008
Competitions
I Prize Winner
Kavita
$100

# అతని రాక కోసం

కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి

అతని రాక....
చిమ్మచీకటి తుమ్మల్లో
పొడిచే పొద్దులా
వెలుగులు విరజిమ్ముతూంటుంది!

యన్.ఆర్.ఐ. గా ఉన్నాడో
దేశ విదేశాల్లో ఎక్కడ తిరుగుతుంటాడో! ఏమో మరి!
పురిటిగడ్డ మీద పుట్టెడు ప్రేమతో
వచ్చేటప్పుడు
సందిళ్ళకొద్దీ సంబరాన్ని
కావిళ్ళకొద్దీ సమాచారాన్ని
మా పల్లెలో కుమ్మరించిపోయేందుకు
గుండెలనిండుగ మూటగట్టుకు తెస్తుంటాడు!

అతని రాక ముందుగా ఎరుకపరచేందుకు
సంతోషంతో చంకలుదట్టుకుంటూ
ఏ 'మీడియా' వార్తై పూయదు!
'వాలుపోస్టరై' వాలదు!

అతని రాక...
మట్టికి అదునూపదునిచ్చే తొలకరి జల్లులా
అమ్మతనపు తడినిచ్చే మధురానుభూతిలా
ఏదో వో జామున
ఉరుములు మెరుపులులేని స్వాతి వాన చినుకై
వాడవాడంతా ప్రేమ వరదై ముంచెత్తుతుతూంటుంది!
మానవ సంబంధాలను పేనుకునేందుకు
అనుబంధాలై హత్తుకునేందుకు
గాలిగొంతుల్లో పాటై
అలలు అలలుగా అందరి హృదయాల్లోకి అల్లుకపోతూ
గర్వంగా తలెత్తిన జన్మభూమి జెండా రెపరెపలతో
గూడెం గుండెను తడిపి వో నిబ్బరాన్నద్దిపోతుంటుంది.
అతని కంటిచూపు కలకలలకు
అతని మాటల గలగలలకు
కులాల కుమ్ములాటలతో
గోలగోలగా ఉన్న మాఊరు
గోకులమై వ్యాకులమూ మాని
తెల్లని నవ్వులతో
మల్లెపూతోటై పరిమళిస్తూంటుంది!
అజ్ఞానం అంధకారం పులిమి
చింపిరి మసిగుడ్డను చేసిన మా గడ్డను
వెతుక్కుంటూ అతడొస్తాడు
మగ్గిపోతున్న మనస్సుల్లో
అస్తిత్వపు అగ్గి రగిల్చిపోతుంటాడు!
శిరసెత్తే మొక్కలా వినమ్రంగా
తరాల అంతరాలను చీల్చుకుంటూ
జీవన వేదాన్ని వినిపించేందుకు
హృదయవీణానాదమై అతడొస్తాడు!
పల్లెకు అతని పలకరింపు
గాయానికి ఆప్యాయంగా లేపనంతా అద్దిను పులకరింపు
గూట్లో పిట్టపిల్లలకు తల్లి కువకువల లాలింపు
పైర గాలికి పంటచేను పరవశింపు
ఊరుఊరుంతా ఆనందం ఎదబెట్టినట్లు
మరచిపోలేని ఓ మురిపిపాటు
కుంభవృష్టై కురుస్తూంటుంది!
పొదిలో విశ్రమిస్తున్న అంబుల్లా
అతని మదిలో ఎన్నో ఆలోచనలు
సంబంధించిన బాణాల్లా
సమస్యలు ఛేదించేందుకు ఎన్నెన్నో సూచనలు!
అతడు నాటిన అక్షరం అంకురించి
మొక్కై మానై విస్తరిస్తూ



నిరాశకూ ఆశకూ వారధి గట్టై
ఉపద్రవాల ఊపు అనుస్తూ
ఊరుదాటి విజ్ఞానమై విస్తృతిస్తూ
అన్నార్తులకు ఆశ్రయమిచ్చేందుకు
అన్నపు ముద్ద ఆకలి తీర్చేందుకు సన్నద్ధమౌతుంటుంది!
గతంలో మారుమూలనుకొంటూ
మరుగుపడిందనుకున్న మాఊరు
ప్రస్తుతం
పాలకుల గుండెల్లో పదునైన జ్ఞాపకమైంది!
పురోగమనానికి పురిటి గడ్డ
స్వయం సంవృద్ధితో సాగిపోతోంది.!
... ... ...
గడపగడపకు వసంతవైభవాన్ని
పచ్చాకుతోరణ సంతోషాన్ని యిచ్చివెళ్ళే అతను
ఎంతోకాలంగా ఊరు కంట్లోవత్తులేసుకొని
ఎదురుచూస్తున్నా..ఇంకా తిరిగి రానేలేదు!
బహుశ: అతడు...
పాపులప్రక్షాళన కోసం ఎక్కడైనా శిలువ సెక్కాడో
లేక.. చిమ్మచీకటి తుమ్మల్లో చిక్కోన్న
మరో ఊళ్ళో పొద్దుపొడుపై
వెలుగులు విరజిమ్మేందుకు వెళ్ళాడోమరి!
ఇంకా అతడు తిరిగి రానేలేదు!!




# తెలుగు గతి ఇంతే

K.వీరభద్ర శాస్త్రి

అక్కడ తెలుగు తనం వెలిగిపోతూవుంటుంది
అక్కడ తెలుగు భాష విలువ పెరిగిపోతూవుంటుంది
అక్కడ తెలుగు పాట అతిమధురంగా పాడబడుతూవుంటుంది
అక్కడ తెలుగు వంటకం ఘుమఘుమ లాడుతూ వుంటుంది

అక్కడ తెలుగు నుడికారపు తీపి రుచి చూపిస్తుంది
అక్కడ తెలుగు పలుకుకి అందాలగుపిస్తాయి
అక్కడ తెలుగు నాట్యంకు పాదాలు నృత్యిస్తాయి
అక్కడ తెలుగు ఆదరణకు కళ్ళు చెమరుస్తాయి

ఆసంబరాలభవన ప్రాంగణం దాటిరాగానే
అలసిసొలసి అర్ధరాత్రి ఇంటికి చేరగానే
ఆదమరచి నిదురపోయి, మర్నాడు లేవగానే
తూర్పు తెల్లారి పడమటభాషారాగం మొదలవుతుంది

బ్రేక్ ఫాస్టుతో బ్రేవుమంటూ
అంతవరకు అణగివున్న
ఆంగ్లం విజృంభిస్తుంది
తెలుగు విభ్రాంతి తొలగిపోతుంది

తెలుగు పలుకు ఆంగ్లలో వ్రాయబడుతుంది
చిన్నారుల నోట యాసోచ్ఛారణ చేయబడుతుంది
తెలుగే మాయ.. తెలుగుపలుకే మాయ
చివరకు తెలుగుగతి ఇంతేనయా




# ఏ దేశమేగినా...

ముప్వ వెంకట్రామి రెడ్డి

ప్రియమైన నాన్నకు!
మీ అమ్మాయి నమస్కరించి వ్రాయునది
ఇప్పుడిక్కడ పదకొండు కావస్తోంది.
ఆయన ఆఫీసుకెళ్లారు
ఆరుసార్లు ప్రయత్నించినా అల్పాహారం రుచించలేదు.
ఆ మాటకొస్తే ఇక్కడి మనుషులూ మాటలూ
గాలీ నీరు వాతావరణం ఏదీ రుచించడం లేదు
రెండ్రోజులకొకసారైనా మీకు ఫోన్ చేస్తానా...
అట్నుంచిటు నాలుగైదు ప్రశ్నలూ
ఇట్నుంచటు అయిదారు జవాబులూ
అంతే, అసలు విషయం గొంతు దాటదు
మరుగుతున్న లావా మాటగా మండదు
ఈ రోజు ఆ కార్చిచ్చును కాగితం మీదికి దొర్లిస్తున్నాను
అగ్నిశిఖల్ని అక్షరాలుగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నాను

అసలు బీటలు మొదలైందెక్కడ?
రోజూ కొన్ని వందలసార్లు
ఈ ప్రశ్నపాము పడగ విప్పుతుంది
ఆ బుస వినిపించిన ప్రతిసారీ
నాకు మనింటి పెరట్లోని మల్లెచెట్టే గుర్తొస్తుంది
ఆరోజు పట్టపగలు
నేను పూలు కోసుకుంటుండగా నువ్వొచ్చి చెప్పావు
'అబ్బాయి అందగాడు - అమెరికా సంబంధం -
అదృష్టమంటే నీదే' నని!
అదే సమయంలో అమెరికాలో కటిక చీకటి ఉంటుందని
నువ్వే కాదు, నేనూ గ్రహించలేకపోయాను
అమ్మలక్కన అసూయల మధ్య
అప్పులతో అలంకరించిన ఆడంబరాల మధ్య
పెళ్ళి తంతు ముగిసింది!

మొట్టమొదటిసారి విమానం ఎక్కినప్పుడు
నేను రైట్ సోదరులకు కృతజ్ఞతలు చెప్పాను
'ఎక్కించింది నేనైతే థ్యాంక్స్ వాళ్లకా?' అంటూ
ఆయన మొహమింత చేసుకుని అడిగినప్పుడు
జోక్ చేశారనే అనుకున్నాను
నెల తిరక్కుండానే అర్థమయింది
అలాంటి జోకుల్తోనే ఆయన కుళ్లబొడుస్తారని

వెంకటలక్ష్మి పిన్నిగారన్నట్లు
ఆయనకు కాలూచెయ్యీ ముక్కూమూతీ
అన్నీ అందంగానే ఉంటాయి
అనారోగ్యం ఆమడదూరం
అయినా ఆయనకు 'నయంకాని రోగం'!
ఉదయం ఆఫీసుకు వెళ్ళేటప్పుడు
ఈ ఆరు గదుల జైల్లో బంధించి బయట తాళం పెడతాడు
ఇక పగలంతా నేను లోపల ఒంటరిగా తగలడుతుంటాను
వారాంతంలో మాత్రం నాకు ఆకాశం కనిపిస్తుంది
పక్షులు కనిపిస్తాయి మనుషులు కనిపిస్తారు
తెలుగువాళ్ళు కలిసినప్పుడూ, వాళ్లతో మాటల్లోకి దిగినప్పుడూ
తాతయ్య లయబద్ధంగా చదివే సుమతీ శతకం గుర్తొస్తుంది
పిజ్జాలూ బర్గర్ల మధ్య
అప్పడాలూ ఆవకాయ పచ్చడీ దొరికినప్పుడు
నా దేహంలో కదలికలకు ప్రాణం వస్తుంది
మూగవోయిన స్వరపేటికపై రాగాలజల్లు కురిసి
అప్రయత్నంగా నాలోంచి పాటలు పురివిప్పేవి
ఇంటిక్  ఎళ్ళాక ఆయన ఏదో ఒక పల్లవిని
పుట్టల్లోంచి బయటికి లాగేవాడు
అందులో ఎన్ని అపశ్రుతులున్నాయో లెక్క తేల్చేవాడు
కంప్యూటర్ పండితుల్ని ఉర్రూతలూగించిన
ఆ లలితగీతాల్ని పట్టుకుని